# ప్రజాస్వరం

PRAJASWARAM తెలుగు దినపత్రిక

మెదక్ సంపుటి : 18 సంచిక : 319 బుధవారం, జులై 16, 2025 పేజీలు:4 వెల: 1 రూ/

Published from Hyderabad, Medak Nalgonda, Karimnagar, Warangal, Khammam


MHR TV



## ప్రపంచ దేశాలకు కోవిడ్ వ్యాక్సిన్ ఎగుమతి చేసిన ఘనత

# ఇక్కడి పారిశ్రామికవేత్తలది

### - సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్** జీనోమ్ వ్యాలీలో ఉన్న (ఇచోర్ బయాలజిక్స్) బయోటెక్నాలజీ సంస్థ, ప్రాణాలను మెరుగుపరిచే, రక్షించే ప్లాస్మా-ఉత్పన్న చికిత్సలను తయారు చేయడానికి అభివృద్ధి పరచడానికి ఇచోర్ పునాది వేసిందని తెలంగాణరాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. శామీర్ పేట జీనోమ్ వ్యాలీలో ఐకార్ బయాలజిక్స్ (ఇచోర్ బయాలజిక్స్) కొత్త యూనిట్ కి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భూమిపూజ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి హాజరైనారు. శామీర్ పేట జీనోమ్ వ్యాలీలో ఐకార్ బయాలజిక్స్ (ఇచోర్ బయోలాజిక్స్) కొత్త యూనిట్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా

2లో..

## ఉగ్రవాదంపై

# స్ట్రాంగ్ మెసేజ్

### పాకిస్తాన్‌కు చురుకులు

- గల్వాన్ లోయ ఘర్షణలతో భారత్, చైనా మధ్య పెరిగినదూరం
- ఐదేళ్ల అనంతరం ఆ దేశానికి వెళ్లిన భారత విదేశాంగ మంత్రి
- ఉగ్రవాదం విషక్ష్ంలో పాకిస్థాన్‌కు పరోక్షంగా జైశంకర్ చురకలు



న్యూఢిల్లీ : ఐదేళ్ల అనంతరం భారత విదేశాంగ శాఖ మంత్రి చైనా పర్యటనకు వెళ్లారు. చైనాలో జరుగుతోన్న షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) విదేశాంగ మంత్రుల కౌన్సిల్ సమావేశానికి భారత్ నుంచి కేంద్ర మంత్రి ఎస్ జైశంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని జైశంకర్ ప్రస్తావించారు. పహల్గామ్ దాడి 'ఉద్దేశపూర్వకంగా జరిపింది' అని అభివర్ణించిన ఆయన ఉగ్రవాదంపై ఎస్సిఓ రాజీ లేని వైఖరిని తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ముష్కరుల దాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. జమ్మ కశ్మీర్‌లో పర్యటక రంగాన్ని దెబ్బతీయడమే కాకుండా మతాల మధ్య చిచ్చు పెట్టడమే ఈ దాడి లక్ష్యమని పేర్కొన్నారు. "పహల్గామ్ ఉగ్రదాడిని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీవ్రంగా ఖండించింది. ఈ అమానుష చర్య వెనుక ఉన్న కుట్రదారులను పట్టుకుని చట్టం ముందు నిలబెట్టాలని డిమాండ్ చేసింది"అని జయశంకర్ అన్నారు. ఉగ్రవాదం, విభజన వాదం, అతివాదం ఈ మూడు దుష్టశక్తులను ఎదుర్కొనేందుకు షాంఘై సహకార సంస్థ ఏర్పాటైందని గుర్తుచేసిన జైశంకర్.. ఇవి తరచూ కలిసి పనిచేసే శక్తులుగా కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. "ఎస్సీఓ ఏర్పాటు మూల లక్ష్యాలు నిబద్ధంగా ఉండాలంటే, ఉగ్రవాదంపై రాజీలేని విధానాన్ని అనుసరించాలి" అని ఆయన పునరుద్ఘాటించారు. పలు సంఘర్షణలు, ఆర్థిక అస్థిరత, తీవ్ర పోటీ, భయానక విధానాలతో ప్రపంచం సాగుతోన్న ఈ తరుణంలో ఎస్సిఓ సభ్య దేశాల మధ్యం భరోసా, సహకారం అత్యవసరమని జయశంకర్ హితవు పలికారు. "ఈ అస్థిర పరిస్థితుల్లో ప్రపంచ గమనాన్ని సుస్థిరం చేసే బాధ్యత మన ముందుంది. దీని ద్వారా మాత్రమే మనం సాధారణ ప్రజల సమస్యలను పరిష్కరించగలం" అని జైశంకర్ పేర్కొన్నారు. "ప్రపంచ వ్యవహారాలను ప్రభావితం చేయాలంటే, సభ్య దేశాలన్నీ ఒకే దారిలో నడవాలి. అందర్నీ కలుపుకుంటూ ముందుకు సాగాలి" అని ఆయన స్పష్టం చేశారు. 2020 జూన్ గల్వాన్ లోయ సైనిక ఘర్షణల

2లో..

## భూమికి చేరుకున్న భారత వ్యోమగామి శుభాంశు శుక్లా

### - క్షణక్షణం ఉత్కంఠగా సాగిన తిరుగు ప్రయాణం



**న్యూయార్క్** భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్షంలో 18 రోజుల పాటు జరిపిన ఆక్సియం-4 మిషన్‌ను విజయవంతంగా పూర్తి చేసి భూమికి తిరిగి వచ్చారు. శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు వెళ్లిన తొలి భారతీయ వ్యోమగామిగా చరిత్ర సృష్టించారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా, మరో ముగ్గురు వ్యోమగాములు

2లో..

# గవర్నర్ వద్దకు బీసీ రిజర్వేషన్ల పెంపు ఆర్డినెన్స్

### - ఆమోదముద్ర వేస్తారా లేదా అన్నదే సస్పెన్స్

**హైదరాబాద్** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు ఆర్డినెన్స్ ను గవర్నర్ కు పంపించారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ ఆర్డినెన్స్ లో పొందుపరిచారు. 285(ఎ) సెక్షన్ లో సవరణలు చేస్తూ ఈ ఆర్డినెన్స్ రూపొందించారు. గవర్నర్ నుంచి ఆమోదం రాగానే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను ఖరారుచేసి నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది.

2లో..




## విద్యార్థుల మరణాలకు సీఎం బాధ్యత వహించాలి

### - రేవంత్ ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదని కేటీఆర్ విమర్శ



**హైదరాబాద్** రాష్ట్రంలో విద్యార్థుల ఫుడ్ పాయిజనింగ్ ఘటనలకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. ఈ ఘటనలకు, విద్యార్థుల మరణాలకు రేవంత్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఏడాది కాలంలో వేలాది మంది విద్యార్థులు ఫుడ్ పాయిజనింగ్ తో అనారోగ్యం పాలయ్యారని, వందకు పైగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ కూడా ఆయన చేతిలోనే ఉన్నప్పటికీ

2లో..

## మాజీ ఈఎన్సీ

# మురళీధర్ రావు అరెస్ట్

- ఆదాయానికి మించి ఆస్తులు - మాజీ ఈఎన్‌సీ మురళీధర్ రావు ఇంటిపై ఏసీబీ సోదాలు
- బంధువుల ఇళ్లలోనూ తనిఖీలు - తనిఖీల తర్వాత అరెస్టు చేసిన ఏసీబీ

**హైదరాబాద్** తెలంగాణ నీటి పారుదల శాఖ మాజీ ఇంజనీర్-ఇన్-చీఫ్ మురళీధర్ రావును ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. హైదరాబాద్, కరీంనగర్, జహీరాబాద్ మొత్తం 11 చోట్ల సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో ఆయనకు సంబంధించి పెద్ద ఎత్తున ఆస్తులు కూడబెట్టినట్లుగా గుర్తించారు. కొండాపూర్ బంజారాహిల్స్ యూసుఫ్ గూడా, బేగంపేట్, కోకాపేట్ తో పాటు హైదరాబాదులోనే 4 ప్రైమ్ లొకేషన్ లో ఓపెన్ ప్లాట్స్, కరీంనగర్లో కమర్షియల్ బిల్డింగ్, వరంగల్లో నిర్మాణంలో ఉన్న బిల్డింగ్, హైదరాబాదులో ఒక కమర్షియల్ బిల్డింగ్, కోదాడలో అపార్ట్మెంట్, జహీరాబాద్ లో సోలార్ పవర్ ప్లాంట్, 11 ఎకరాల వ్యవసాయ భూమి,మోకిలాలో 6500 చదరపు గజాల భూమి, 3 కార్లు ఉన్నట్లుగా గుర్తించారు. బ్యాంకు డిపాజిట్, బంగారం అలాగే లాకర్ల గురించి వివరాలు లెక్కించాల్సి ఉన్నట్లుగా తెలుస్తోంది. మురళీధర్ రావు అరెస్టు కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో అవినీతి ఆరోపణలతో ముడిపడి ఉంది. ఈ ప్రాజెక్ట్‌లో అక్రమాలకు సంబంధించి ఆయన ఆస్తులలో కొంత భాగం, అతని కుమారుడు అభిషేక్ వ్యాపారంలోకి మళ్లించినట్లుగా ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి ఆరోపణలపై కమిషన్ విచారణ కొనసాగుతోంది, ఈ కేసు ఈ ప్రాజెక్ట్‌లోని అక్రమాలతో సంబంధం ఉందని చెబుతున్నారు.



మురళీధర్ రావు భారత రాష్ట్ర సమితి పాలనలో దాదాపు ఒక దశాబ్దం పాటు ఇంజనీర్-ఇన్-చీఫ్‌గా పనిచేశారు. 2013లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రిటైర్ అయినప్పటికీ, ఆయనకు సుదీర్ఘ కాలం పొడిగింపులు లభించాయి. 2024 ఫిబ్రవరిలో, కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లోని మేడిగడ్డ బ్యారేజ్‌లో స్తంభాలు కుంగిపోవడంపై విజిలెన్స్ శాఖ దర్యాప్తు తర్వాత ఆయనను రాజీనామా చేయమని ఆదేశించారు. ఇదే విధమైన కేసులో, జూన్ 2025లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో సంబంధం ఉన్న మరొక ఇంజనీర్ నూనే శ్రీధర్‌ను ఏసీబీ అరెస్టు చేసింది. ఆయన వద్ద

2లో..

## సీఎంల భేటీలో తెలంగాణ వాదన

# గట్టిగా వినిపించాలి

### తెలంగాణకు కేంద్రం అన్యాయం చేయదన్న బండి



**హైదరాబాద్** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరగనున్న సమావేశంలో తెలంగాణ వాణిని బలంగా వినిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సూచించారు. కేంద్ర జలశక్తి శాఖ నుంచి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు పిలుపు వచ్చింది. నేడు ఈ సమావేశం జరగనున్న నేపథ్యంలో బండి సంజయ్ స్పందించారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం చేయదని ఆయన అన్నారు. కేంద్రానికి రెండు రాష్ట్రాలు సమానమేనని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు జరిగే నష్టాన్ని ముఖ్యమంత్రి వివరించాలని సూచించారు. కరీంనగర్‌లో పర్యటించిన బండి సంజయ్ మాట్లాడుతూ, బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసే అన్యాయాన్ని బీసీ సంఘాలు ఎందుకు ప్రశ్నించడం లేదని ఆయన నిలదీశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన సమగ్ర సర్వేలో బీసీలు 51 శాతమని తేలితే, కాంగ్రెస్ సర్వేలో మాత్రం 46 శాతంగా ఉండటం ఏమిటని ప్రశ్నించారు. బీసీలలో ముస్లింలను కలపడం సరికాదని ఆయన అన్నారు. బీసీ ఆర్డినెన్స్‌ను తాము వ్యతిరేకించబోమని, కానీ బీసీల్లో ముస్లింలను కలిపితే మాత్రం అడ్డుకుంటామని తేల్చి చెప్పారు. బీసీ రిజర్వేషన్లలో ముస్లింలను కలుపుతూ అన్యాయం చేస్తోందని, బీసీ నాయకులు ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు.

## ఇందిరా పార్క్‌లో బిసి మహాధర్నాలో బీఆర్ఎస్ సిర్పూర్ నేతలు

సిర్పూర్, : హైదరాబాద్ ఇందిరా పార్క్‌లో మంగళవారం జరిగిన బిసి ల మహాధర్నాలో బీఆర్ఎస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లేండుగురే శ్యామ్ రావ్ మరియు సిర్పూర్ నియోజకవర్గానికి చెందిన అన్ని మండలాల BC నాయకులు పాల్గొన్నారు. ఈ ధర్నాకు పార్టీ అధిష్టానం సంపూర్ణ మద్దతు ప్రకటించింది, ప్రభుత్వం 42% BC రిజర్వేషన్లను ఆలస్యం చేస్తుందని విమర్శలు వెల్లువెత్తాయి.

## ఆరు నెలల్లో అద్దం లాంటి రోడ్డా?

ఆసిఫాబాద్, : సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి రోడ్డు అభివృద్ధిపై ఇచ్చిన హామీలు ఇంకా నెరవేరని నేపథ్యంలో ప్రజలు వ్యంగ్యంగా స్పందిస్తున్నారు. "ఆరు నెలల్లో అద్దం లాంటి రోడ్డంటూ చెప్పిన ఎమ్మెల్యే ఇప్పుడు ముఖం చూపించలేరు" అంటున్నారు. హైదరాబాద్‌లో పార్టీలకు వెళ్లి, కాగజ్‌నగర్ వచ్చి రిలీఫ్ ఫండ్ చెక్కులు పంచడం తప్ప అభివృద్ధి పనులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

## లబ్ధిదారుల జాబితా విడుదల

చెన్నూరు, : భూమాత రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల జాబితాను కాగజ్‌నగర్ మండలం భట్‌పల్లి గ్రామపంచాయతీ నోటీసుబోర్డుపై మంగళవారం అంటించామని గ్రామపంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఈ ప్రకటన ద్వారా లబ్ధిదారుల వివరాలను పబ్లిక్ చేశారు. జాబితాలో పొందుపర్చిన వివరాలపై ఎవరైనా అభ్యంతరాలు కలిగి ఉంటే వారు తహశీల్దార్ ఆఫీసును సంప్రదించాలని సూచించారు. దీంతో పారదర్శకత పెరుగుతోందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## ఆయిల్ పామ్ దిగుబడి 30 సంవత్సరాల వరకు ఉంటుంది

ధర్మపురి, : ఆయిల్ పామ్ దిగుబడి 30 సంవత్సరాల వరకు ఉంటుందని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ అన్నారు. మంగళవారం ఉద్యాన శాఖ, లోహియా ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి గాను గొల్లపల్లి మండల కేంద్రంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి శ్యామ్ ప్రసాద్, డిఏవో భాస్కర్ పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

సిరిసిల్ల,: భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్ కుమార్ తెలిపారు. మంగళవారం సిసిఏల్ఏ లోకేష్ కుమార్ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై అదనపు కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం వేగంగా పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.

## కక్ష సాధింపు పాలన.. చల్మెడ తీవ్ర స్థాయిలో విమర్శలు

వేములవాడ, : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణ, మూలవాగు రెండవ వంతెన నిర్మాణాల్లో భాగంగా జరుగుతున్న కూల్చివేతలు స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని, ప్రభుత్వ తీరులో కక్ష సాధింపు స్పష్టంగా కనిపిస్తోందని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

## 12వ డివిజన్‌లో అభివృద్ధి పనులు

కరీంనగర్, : కరీంనగర్ పట్టణంలోని 12వ డివిజన్ లో మంగళవారం భగత్ నగర్ లోని వెంకటేశ్వర కాలనీలోని రోడ్ నెంబర్ 5లో సీసీ రోడ్డు నిర్మాణానికి స్థానిక కాలనీ వాసులతో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులను డివిజన్ మాజీ కార్పొరేటర్ తోట రాములు ప్రారంభించారు. మున్సిపల్ సాధారణ నిధుల నుండి రూ. 33 లక్షలు వెచ్చించి ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టినట్టు కార్పొరేటర్ తెలిపారు.

## తీన్మార్ మల్లన్నపై దాడిని ఖండించిన బీసీ సంఘం

పినపాక, : మణుగూరు మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ముఖ్య నాయకులు మంగళవారం సమావేశమయ్యారు.

జిల్లా ఇంఛార్జ్ సోమేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. హైదరాబాదులో బీసీ బిడ్డ తీన్మార్ మల్లన్నపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మూడు శాతం లేని వెలుమ దొరలను మీకు మాకు కంచం పొత్తు ఉందా ఇయ్యం పొత్తు ఉందా అని అడగడం తప్పేంటని ప్రశ్నించారు. మల్లనపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రక్త పరీక్ష శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్

కొత్తగూడెం,: కొత్తగూడెంలో మంగళవారం రైల్వే స్టేషన్ ఆవరణలో ఇండియన్ యూత్ సెక్యూర్డ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ హాజరై ప్రారంభించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ. ప్రజలు తమ బ్లడ్ గ్రూప్ తెలుసుకోని, అత్యవసర సమయంలో ఉపయోగపడేలా ఉంటుందని, ప్రతి ఒక్కరు దీనిని ఉపయోగించుకోవాలని కోరారు.

## మొక్కల సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలి



**బెల్లంపల్లి :** మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరు తీసుకోవాలని వేమనపల్లి మండల మాజీ జెడ్పిటిసి సంతోష్ కుమార్ పేర్కొన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం వేమనపల్లి మండలంలోని నీల్వాయి గ్రామంలో మొక్కలను నాటారు. మొక్కల పెంపకంతో పర్యావరణ సమతుల్యత పెరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీ, ఎంపీడీవో కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శక్తి సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుపై పరిశీలన



జగిత్యాల, : జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఇందిరా మహిళా శక్తి సోలార్ పవర్ ప్లాంట్ యూనిట్ ఏర్పాటు చేస్తున్న క్రమంలో హైదరాబాద్ నుండి కంపెనీ ప్రతినిధి స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి యూనిట్ కోసం రెవెన్యూ శాఖ వారు ఇచ్చిన ప్రభుత్వ స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. వారితో జిల్లా ఎపియం కోల శ్రీనివాస చక్రవర్తి, మండల ఎపియం వోదెల గంగాధర్ ఉన్నారు.

## గిరిజన ప్రజలకు ఆధార్ కార్డులివ్వండి

**- గ్రామాలలో ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేయాలి**
**- సామాజిక కార్యకర్త, న్యాయవా ది కర్నె రవి**




**భద్రాద్రి కొత్తగూడెం** మణుగూరు, అందరికీ ఆధార్ ఓ వరమని, ఆధార్ కార్డ్ తో అన్ని ప్రభుత్వ అందుకోవచ్చని, కానీ మండలంలోని మారుమూ ల గిరిజనులకు మాత్రం అది ఇంకా ఓ శాపంగా మారిందని,సామాజిక కార్యకర్త, న్యాయ వాది కర్నె రవి అన్నారు.ఆధార్ కార్డులు లేని గిరిజనులకు ఆధా ర్ కార్డులు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని కోరుతూ మంగళవారం ఆయన తహసిల్దార్ అద్దంకి నరేష్ నరేష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భం గా రవి మాట్లాడుతూ.. మండలం లో మారుమూల ఆది వాసి గ్రా మాలైన ఖమ్మం తోగు, బుగ్గ, బు దుగుల, పెద్దిపల్లి, ఇప్ప ల గుంపు గ్రామాలకు చెందిన గుత్తి కోయ ప్రజల పిల్లలకు, ఆధార్ కార్డులు, బర్త్ సర్టిఫికెట్లు, లేకపోవడంతో చదువుకు, ఇతర ప్రభుత్వ పథకాలకు ఇప్పటి వరకు దూరంగా ఉన్నారని తెలి పారు. ఓవైపు ఆయా గ్రామాల్లో అధికంగా నిరక్షరాస్యులు ఉన్నా రని, దీంతో వారు ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియక నేటి వరకు ఆధార్ కార్డులనుప్రజలుపొందలేదన్నారు.ప్రభుత్వ సంక్షే మపథకాలు పొందాలంటే తప్ప నిసరిగా ఆధార్ కార్డు అవసర మని, మొదటిగా జనన ధ్రువీ కరణ పత్రం అవసరమని, ధ్రువీ కరణ పత్రం లేకపోవడం తో వారికీ ఇప్పటివరకు ఆధార్ కా ర్డులు మంజూరు కాలేదన్నా రు.విద్యార్థులను స్కూల్‌లో వేయాలంటే ఆధార్ తప్పనిసరి, రేషన్ కార్డ్ కావాలంటే ఆధార్ ఉండాలి, అనుకోని ప్రమాదం జరిగితే ఆరోగ్యశ్రీ కింద చికిత్సకి కూడా ఆధారే కీలకం. కానీ ఆధా ర్ గురించి, పథకాల గురించి సరైన అవగాహన లేక గిరిజ నులు వీటన్నిటికీ దూరమైపోయారని పేర్కొన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రా లలో బర్త్ సర్టిఫికెట్ తో సంబంధం లేకుండా, కుటుంబ వివరాలను నమోదు చేసుకొని మండల స్థాయి అధికారులు సమన్వయంతో వందశాతం గిరిజనులకు ఆధార్ కార్డులను అందించేందుకు చర్యలు తీసు కోవాలని కోరారు.

## భార్య భర్తల పంచాయతీలో ఇద్దరి దారుణ హత్య



**పెద్దపల్లి** భార్యాభర్తల పంచాయతీలో ఇద్దరి దారుణ హత్య చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్ళితే పెద్దపల్లి జిల్లా సుల్తానా బాద్ మండలం సుగ్లాంపల్లిలో పెద్దమనుషుల పంచాయతీలో దారుణం చోటుచేసుకుంది. భార్య తరపున బంధువులు భర్త తరపున బందువులపై మారణాయుధాలు కత్తులతో దాడులకు దిగారు. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు దారుణ హత్య కు గురికాగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ కత్తిపోట్లలో ఓదెలకు చెందిన మోటం మల్లేష్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా పెద్దపల్లి మండలం రాఘవాపూర్ కు చెందిన గాండ్ల గణేష్ అనే యువకుడు సైతంలో మృతి చెందాడు. మధునయ్య, మారయ్య అనే వ్యక్తుల పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

## ప్రపంచ దేశాలకు కోవిడ్ వ్యాక్సిన్ ఎగుమతి చేసిన ఘనత ఇక్కడి పారిశ్రామికవేత్తలది

హైదరాబాద్ రూపుదిద్దుకుంటుందని, దేశంలోనే 33 శాతం వ్యాక్సిన్స్, బల్క్ డ్రగ్స్ లో 43 శాతం ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతున్నాయన్నారు. కోవిడ్ సమయంలో జీనోమ్ వ్యాలీ నుంచే ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్ ను ఎగుమతి చేసిన ఘనత ఇక్కడి పారిశ్రామికవేత్తలది ,ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక విధానాన్ని ముందుకు తీసుకెళ్లే విధంగానే ప్రభుత్వాల నిర్ణయాలు ఉన్నాయన్నారు. మా ప్రభుత్వం మరింత సరళమైన విధానాలతో ముందుకెళ్తుందని, నూతన పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తుందని, వారికి అవసరమైన సహకారాన్ని అందిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ డేటా సిటీగా మారనుంది మేం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 3లక్షల 28 వేల కోట్లు పెట్టుబడులు సాధించామని తెలిపారు. ప్రపంచ దేశాలతో పోటీ పడాలని, అధునాతన విధానాలను తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని, రాబోయే పదేళ్లలో తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. ముందుగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డిలు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

## ఉగ్రవాదంపై స్ట్రాంగ్ మెసేజ్

తర్వాత భారత విదేశాంగ మంత్రి జయశంకర్ మొదటిసారి చైనాలో పర్యటించడం గమనార్హం. ఇటీవల రక్షణ మంత్రుల సదస్సుకు రాజ్‌నాథ్ సింగ్ హాజరైన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ వార్నింగ్ ఇచ్చారు. క్వింగ్‌డాంగ్‌లో జరిగిన సమావేశం తర్వాత సంయుక్త ప్రకటనలో పహల్గామ్ ఉగ్రదాడి ప్రస్తావన లేకపోవడం, పాక్‌లోని బలూచిస్థాన్‌ను అందులో చేర్చడంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిని భారత్‌పై పరోక్షంగా ఆరోపణలు చేయడంగా భావించి, ఈ ప్రకటనపై సంతకం చేయడానికి రాజ్‌నాథ్ సింగ్ నిరాకరించారు. దీంతో సంయుక్త ప్రకటన రద్దుకావడం గమనార్హం.

## మాజీ ఈఎన్సీ మురళీధర్ రావు అరెస్ట్

సుమారు 60 కోట్ల రూపాయల విలువైన ఆస్తులు గుర్తించారు. ఏసీబీ సోదాల్లో గుర్తించిన ఆస్తులలో హైదరాబాద్ , చుట్టుపక్కల ప్రాంతాల్లో లగ్జరీ విల్లాలు, వివిధ ప్రాంతాల్లో భూములు, నగదు, బంగారు ఆభరణాలు, పెట్టుబడి రికార్డులు ఉన్నాయని నివేదికలు సూచిస్తున్నాయి. ఏసీబీ అధికారులు మరింత లోతుగా మురళీధర్ రావు ఆదాయ మూలాలు, ఆస్తి పత్రాలు, ఇతర ఆర్థిక లావాదేవీలను పరిశీలిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై విచారణకు నియమితులైన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు మాజీ ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఈఎన్సీ) సి. మురళీధర్ రావు హాజరయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్లు, నిర్మాణంలో లోపాలు, నిర్వహణ సమస్యలపై అనేక ప్రశ్నలు ఎదుర్కొన్నారు. అయితే ఆయన దేనికీ సూటిగా సమాధానమివ్వలేదని తెలియదు, గుర్తులేదు, మర్చిపోయానని సమాధానం ఇచ్చారన్న ప్రచారం జరుగుతోంది. ఆయన ఆస్తుల వ్యవహారం వెలుగులోకి రావడం, కాళేశ్వరం కమిషన్ రిపోర్టు ప్రభుత్వానికి చేరడానికి ముందు పెను సంచలనం అనుకోవచ్చు.

## విద్యార్థుల మరణాలకు సీఎం బాధ్యత వహించాలి

ఇంతవరకు ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదని విమర్శించారు. కనీసం ఒక తండ్రిగానైనా రేవంత్ స్పందించాలని పిల్లలు కలిగిన ఒక తండ్రిగా కోరుతున్నానని కేటీఆర్ అన్నారు. మీ పిల్లలకు విషం కలిపిన ఆహారాన్ని ప్రభుత్వం పెడితే మీరు ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం నిర్లక్షంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి సరైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని తగిన సమయంలో తీర్పు ఇస్తారని చెప్పారు.

## భూమికి చేరుకున్న భారత వ్యోమగామి శుభాంశు శుక్లా

మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు కాలిఫోర్నియా సమీపంలోని సముద్రతీరంలో ల్యాండయ్యారు. సోమవారం వీరు డ్రాగన్ స్పేస్ క్రాఫ్ట్ ద్వారా తిరుగు పయనమయ్యారు. భూమిని చేరుకున్న వీరిని ఏడు రోజుల పాటు క్వారంటైన్‌కు తరలిస్తారు. శుభాంశుతో పాటు ఉన్న వ్యోమగాములంతా అంతరిక్షంలో భారరహిత స్థితిలో గడిపారు. ఈ కారణంగా భూమిపైకి చేరగానే ఇక్కడి వాతావరణానికి వారి శరీరాలు అలవాటు పడేందుకు నాసా ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. అందుకోసమే వారం రోజుల పాటు రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఉంచుతారు. ఇస్రోకు చెందిన వైద్యాధికారులు కూడా ఈ వ్యోమగాముల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. 18 రోజుల అంతరిక్ష యాత్రలో శుక్లా టీం అనేక పరిశోధనలు జరిపింది. శు భాంశు , అతని టీమ్ స్పేస్‌లో 60కి పైగా శాస్త్రీయ ప్రయోగాలను నిర్వహించారు. ఇందులో 7 ఇస్రో రూపొందించినవి. క్రోగ్రావిటీలో విత్తనాలు మొలకెత్తడం, అభివృద్ధిని పరిశీలించడం, భవిష్యత్ అంతరిక్ష వ్యవసాయం కోసం జన్యు లక్షణాలు, సూక్ష్మజీవుల పరస్పర చర్యలు, పోషక విలువలను అర్థం చేసుకోవడం. సున్నా గురుత్వాకర్షణలో మైక్రోఆల్గీ సాగు, ఆక్సిజన్, ఆహారం, బయోఫ్యూయల్ ఉత్పత్తికి దాని సామర్థ్యాన్ని పరీక్షించడం. అంతరిక్షంలో గ్లూకోజ్ పర్యవేక్షణ, ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి అంతరిక్ష ప్రయాణాన్ని మరింత సమగ్రంగా చేయడానికి ఎలాంటి పరిస్థితులు ఉంటాయన్నదానిపై పరిశోధనలు చేశారు.

## గవర్నర్ వద్దకు బీసీ రిజర్వేషన్ల పెంపు ఆర్డినెన్స్

తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతంకి పెంచేందుకు తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018లో సవరణలు చేసే ఆర్డినెన్స్‌ను జారీ చేయాలని నిర్ణయించుకుంది. కానీ ఈ ఆర్డినెన్స్ జారీ చేస్తే కొన్ని చట్టపరమైన సమస్యలు వస్తాయి. సుప్రీం కోర్టు రిజర్వేషన్ల మొత్తం పరిమితిని 50 శాతంగా నిర్దేశించింది. ఆర్డినెన్స్ జారీ చేస్తే తెలంగాణలో 42 శాతం బీసీ, 18 శాతం ఎస్సీ, 10 శాతం ఎస్టీ రిజర్వేషన్లతో మొత్తం 70 శాతానికి చేరుతుంది, ఇది సుప్రీం కోర్టు పరిమితిని మీరుతుంది. ఈ అంశం ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం ఇవ్వడంలో అడ్డంకిగా ఉండవచ్చని న్యాయనిపుణులు చెబుతున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 213(1)(ఏ) ప్రకారం, రాష్ట్రపతి ముందస్తు ఆమోదం అవసరమయ్యే విషయాలపై గవర్నర్ ఆర్డినెన్స్‌ను జారీ చేయరని అంటున్నారు.తెలంగాణ ప్రభుత్వం కుల గణన ఆధారంగా 42 శాతం రిజర్వేషన్ కల్పించడానికి అవసరమైన డాటాను సమర్పించింది. ఈ డేటాకు ఎలాంటి చట్టపరమైన సాధికారత ఉంటుందన్నదానిపై స్పష్టత లేదు. కులగణన ఆధారంగా బీహార్‌లో 65 శాతం రిజర్వేషన్ పెంచినప్పుడు పాట్నా హైకోర్టు దానిని రాజ్యాంగ విరుద్ధంగా పేర్కొని రద్దు చేసింది. ఇక్కడా అలాంటి పరిస్థితి రావొచ్చని భావిస్తున్నారు. గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేస్తే విషయం కోర్టులుక వెళు ుంది. లేకపోతే గవర్నర్ వద్దే ఆగిపోతుంది. ఈ ఆర్డినెన్స్ విషయంలో ఎలా చూసినా వివాదాస్పదమయ్యే అవకాశం ఉంది.బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చి తీరుతామని కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో డిక్లరేషన్ ప్రకటించింది. ఆ ప్రకారం కులగణన చేపట్టిన కాంగ్రెస్ పార్టీ వాటి ఆధారంగా ఓ డెడికేటెడ్ కమిషన్ ను ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ సిఫారసుల ప్రకారం రిజర్వేషన్లను పెంచాలని బిల్లులను ఆమోదించి.. కేంద్రానికి పంపించారు. ప్రస్తుతం ఆ బిల్లులు కేంద్రం వద్ద ఉన్నాయి. పెండింగ్ లో ఉన్న బిల్లులపై ఆర్డినెన్స్ జారీ చేయడం కూడా చెల్లదన్న వాదనను కొంత మంది నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ గతంలో త్రిపుర గవర్నర్‌గా ఉన్నప్పుడు రాజ్యాంగ సమస్యలపై జాగ్రత్తగా వ్యవహరించిన రికార్డు ఉంది. తెలంగాణలో కూడా, ఆయన రాజ్యాంగ విధులను కఠినంగా పాటించే అవకాశం ఉందని భావిస్తున్నారు. జిష్ణుదేవ్ వర్మ..ఈ ఆర్డినెన్స్ ను న్యాయ, రాజ్యాంగ పరిశీలనకు పంపిస్తే నిర్ణయం తీసుకునేందుకు కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

## కంటోన్మెంట్‌లో 35 వేల వోట్ల తొలగింపు

### బీఆర్ఎస్ నేతల ఆగ్రహం

**సికింద్రాబాద్** కంటోన్మెంట్ లో 35వేల మంది ఓటు హక్కును తొలగించడం జరిగిందని దీనిని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పట్టించుకోవడం లేదని బీ ఆర్ ఎస్ అధికార ప్రతినిధి క్రిశాంక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నేత హసీన్ చేపట్టిన నిరసన దీక్షలో ముఖ్య అతిథిగా క్రిశాంక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో ఓట్లు వేయించుకొని గెలిచిన శ్రీ గణేష్, ఈటల రాజేందర్ లు బోర్డు ఎన్నికల్లో 35వేల మంది ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం లేకుండా పోయిందని అన్నారు.

ఆ విషయం ఆ ఓటర్లకు కూడా కంటోన్మెంట్ అదికారులు తెలియచేయలేదని ఆరోపించారు. కేంద్రం నుండి 750కోట్ల నిధులు తీసుకు వస్తానని అప్పటి బీజేపీ రాష్ట్రధ్యక్షుడు ఇప్పటి కేంద్ర మంత్రి బండి సంజాయ్ ప్రజలకు ప్రమాణం చేసారని తెలిపారు. వాటిని తీసుకురాకపోగా కంటోన్మెంట్ భూములను తీసుకొని బదులుగా ఇచ్చిన 300కోట్లు మేము తెచ్చామంటే మేము తెచ్చామని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు జబ్బలు చరుచుకోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటి కోసం పదేళ్లలో ఉన్న కేంద్ర మంత్రులను అప్పటి మంత్రి కేటీఆర్ కలసి వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ బుధవారం 16, జులై 2025
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

## నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ 2025 ఆవిష్కరించిన

# మంత్రి దామోదర్ రాజనర్సింహ

### కరాటే పోటీలలో అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చిన మంత్రి రాజనర్సింహ





**మనోహరాబాద్ (ప్రజాస్వరం)** కరాటే శిక్షణ పొంది ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి డా.సీ. దామోదర్ రాజ నర్సింహ అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ 2025 కప్ మరియు పోస్టర్ ను ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డైనమిక్ షోటోకన్ కరాటే ఆర్గనైజేషన్ వారు నిర్వహిస్తున్న ఈ ఛాంపియన్ షిప్ పోటీలు ఈ నెల 27న మేడ్చల్ లో జరుగనున్నాయని ఈ పోటీలకు అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.
అందరికీ ఆత్మస్థైర్యాన్ని కలిగించే కరాటే క్రీడాను శిక్షణ ఇస్తున్న మాస్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు,ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ పీసిసి రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ రీజినల్ కన్వీనర్ కనిగిరి లింగం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాస్టర్ సీ హెచ్.సాయి కుమార్,మాస్టర్ , కే.సురేష్, మాస్టర్ యు.శ్రీనివాస్, ఇతర మాస్టర్లు, ఇంద్రసేనా, టీ.జనార్ధన్, పీ.శ్రీరాములు(శివ), ఎస్. శంకర్,వీ.స్వామి,సీ.మహేశ్,ఎ.రాజు, వినీత్, అఖిల్లు పాల్గొన్నారు





## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద

# అన్న ప్రసాద వితరణ

**శామీర్ పేట, జూలై 15 (ప్రజా స్వరం):** శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ చేపట్టారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆషాఢ మాసం పురస్కరించుకొని అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద రిసాల బజారుకు చెందిన చిక్కల ధనలక్ష్మి, శ్రీనివాస్, సాయి చంద్రహాస్, సుస్మన్ అన్నదానం చేపట్టగా, బొమ్మ రాసిపేటకు చెందిన గుండెబోయిన అశోక్ యాదవ్, అనిత దంపతులు 25 కేజీల బియ్యం ఇవ్వగా, సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన ఎ. నరేందర్ అన్నదానానికి సహకరించారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

## రాజీవ్ రహదారి విస్తరణ బాధితుల

# ముందస్తు అరెస్ట్

### పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ తరలింపు..




**శామీర్ పేట జూలై 15 (ప్రజాస్వరం)** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శామీర్ పేట జినోమ్ వ్యాలీలో మంగళవారం ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు మద్యాహ్నం 12 గంటలకు తరుణంలో, ఉదయం 4 గంటలకు రాజీవ్ రహదారి విస్తరణ బాధితులు ఈశ్వర్ గౌడ్, గుంతల కృష్ణారెడ్డి, విద్యసాగర్, సూర్య ప్రకాష్ రెడ్డి తదితరులను పోలీసులు ఇంటి నుండి అరెస్ట్ చేసి పెట్ బషీర్ బాగ్ పోలీస్ స్టేషన్ కి తరలించారు, ఎందుకు మమ్మల్ని అరెస్టు చేశారు అని అడిగితే, పోలీసు అధికారులు ముందస్తు జాగ్రత్తగా సీఎంకు రాకపోకలకు మీరు ఆటంకం చేస్తారని ఉద్దేశంతో అరెస్ట్ చేశామని తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రాజీవ్ రహదారి ప్రపర్టిస్ ఓనర్స్ జెఏసి చైర్మన్ తేలుకుంట సతీష్ గుప్తా వెంటనే పెట్ బషీర్బాగ్ పోలీస్ కి కొంతమంది జెఏసి సభ్యులను తీసుకెవెళ్లి అరెస్ట్ అయిన బాధితులను పరామర్శించారు. అనంతరం ఇనస్పెక్టర్ తో మాట్లాడిన సతీష్ గుప్తా అరెస్ట్ ఐనా తుమ్మంట జెఏసి సభ్యులను విడుదల చేయాలని కోరారు, కాని ఇనస్పెక్టర్ మాత్రం సీఎం కార్యక్రమం అయ్యే వరకు విడిచిపెట్టవద్దు అని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు

. జెఏసి చైర్మన్ తేలుకుంట సతీష్ గుప్తా ప్రభుత్వ చేర్యాలను ఖండిస్తూ ఇలా అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ జెఏసి రాష్ట్ర ప్రభుత్వానికి లేదా వారు చేపడుతున్న అభివృద్ధికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు అలాగే 100 నుండి 120 ఫీట్లు రోడ్డు సరిపోయే ఎలివెటడ్ కారిడర్ కి 200 ఫీట్లు రోడ్డు విస్తరణ చేయడం వల్ల వేలాది కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది అని అలాగే 100 ఫీట్లకు కూడా ఆస్తులు కోల్పోతున్న వారికి ఎలాంటి నష్ట పరిహారం ఇస్తున్నారో తెలియడం లేదని సతీష్ గుప్తా ఆవేదన వ్యక్తం చేశారు. జెఏసి సీఎంతో చర్చలకు సిద్ధం అని ఎప్పుడూ పిలిచిన సిద్ధం అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సోనారామ్ , నరేందర్ గౌడ్ లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా

# ఖరీదైన శస్త్రచికిత్స



శామీర్ పేట జూలై 15(ప్రజా స్వరం)తూముకుంట మున్సిపాలిటీ పరిధి దేవరయంజాల్ గ్రామానికి చెందిన కట్ట రాజమ్మ వయస్సు 88 సంవత్సరాలు ఆమె కాలు జారి కింద పడడంతో తుంటి ఎముక విరిగింది. వెంటనే ఆమెను నగరంలోని ప్రైవేట్ హాస్పిటల్ కు తీసుకెళ్లారు, అక్కడ డాక్టర్లు పరీక్షించి ఆమెకు తుంటి ఎముక విరిగిందని ఖరీదైన ఇంప్లాంట్ వేయాలని మొత్తం ఖర్చు మూడు లక్షల యాభై వేల రూపాయలు అవుతుందని డాక్టర్లు చెప్పారు. వారిది డబ్బులు పెట్టుకోలేని పరిస్థితి మెడిసిటీ హాస్పిటల్లో రాజీవ్ ఆరోగ్యశ్రీ సౌకర్యం ఉందని తెలియడంతో శనివారం ఇక్కడికి రావడం జరిగింది. ఇక్కడి డాక్టర్లు పరిశీలించి ఈ ఆపరేషన్ రాజీవ్ ఆరోగ్యశ్రీలో వర్తిస్తుందని ఆరోగ్య మిత్ర మహమ్మద్ యూసుఫ్ సహకారంతో రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. వెంటనే ఆమెకు ఆపరేషన్ కి సంబంధించిన ఏర్పాట్లు చేయడం జరిగింది, మంగళవారం ఆమెకు విజయవంతంగా శస్త్ర చికిత్స చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ అనే పథకం బీదవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, మేము మొదటగా ప్రైవేట్ హాస్పిటల్ వెళితే మూడున్నర లక్షలు అడగగానే మాకు గుండె ఆగినంత పని అయిందని, వెంటనే మేము మెడిసిటి హాస్పిటల్ కు తీసుకొని వచ్చాము, ఇక్కడకు వచ్చిన తర్వాత వెను వెంటనే ఆపరేషన్కు ఏర్పాట్లు చేసి విజయవంతంగా శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడిన మెడిసిటీ హాస్పిటల్ వైద్య బృందానికి, ఆపరేషన్ కు ఎంతగానో సహకరించిన రాజీవ్ ఆరోగ్య శ్రీ ఆరోగ్య మిత్ర మహమ్మద్ యూసుఫ్, టీమ్ లీడర్ హరి కిరణ్, డిస్టిక్ మేనేజర్ ప్రమోద్, డిస్టిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ సతీష్ లకు ధన్యవాదాలు తెలిపారు,


## అక్రమ నిర్మాణం

# కూల్చివేత



**మెదక్ జూలై 15 (ప్రజా స్వరం)** మెదక్ పట్టణంలో మిలట్రీ కాలనీ లోని అక్రమ నిర్మిస్తున్న భవనాన్ని పోలీసుల బందోస్తు మధ్యలో మంగళవారం మున్సిపల్ అధికారులు కూల్చి వేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ఎలాంటి నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయడం జరుగుతుందని అన్నారు.

ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరు అక్రమంగా నిర్మాణాలు నిర్మించొద్దని అలా నిర్మిస్తే వాటి పై చర్యలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, పోలీస్ లు పాల్గొన్నారు.



## గణంగా శామీర్ పేట

# ప్రెస్ క్లబ్ అధ్యక్షుడి జన్మదిన వేసుకులు




**శామీర్ పేట జూలై 15(ప్రజా స్వరం)** ఉమ్మడి శామీర్ పేట మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు క్యాతం రవి జన్మదిన వేడుకలు శామీర్ పేట ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఘనంగా జరిగాయి. జన్మదిన వేడుకలకు ఉమ్మడి శామీర్ పేట మండల పాత్రికేయులు, రాజకీయ నాయకులు హాజరై ఆయనకు శభాకాంక్షలు తెలిపిన వారిలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, మేడ్చల్ జిల్లా ట్రాస్మా వైస్ ప్రెసిడెంట్ గోనె.హనుమంత్ రెడ్డి, ఉపాధ్యాయులు, మండలంలో నివివిధ నాయకులు, ప్రెస్ క్లబ్ అప్ ప్రధానకార్యదర్శి బత్తుల ప్రభాకర్ యాదవ్, ఉపాధ్యక్షుడు సింగం ఉపాధ్యక్షుడు పవన్ కుమార్, సీనియర్ పాత్రికేయులు దేశం కృష్ణ గౌడ్, గిరిప్రసాద్,పాత్రికేయులు రవిని బారిగజమాల, శాలువతో సన్మానం చేశారు.

# కాలనీ రోడ్డు కబ్జా...!

## దర్జాగా ఫెన్సింగ్

- రోడ్డు పైనే బోరు, చెట్లను నాటిన అక్రమణదారు
- ' ప్రజావాణిలో కలెక్టర్ మను చౌదరికి ఫిర్యాదు చేసిన బాధితులు





**శామీర్ పేట జూలై 15(ప్రజా స్వరం):** శామీర్ పేట మండలం తూంకుంట గ్రామ రెవెన్యూ పరిధిలో కాలనీ రోడ్డుపై అక్రమంగా ఫెన్సింగ్ వేసి, బోరు వేసి చెట్లు నాటి ఆక్రమించుకున్న ఘటన కలకలం రేపుతోంది. బాధితులు సోమవారం జిల్లా కలెక్టరేట్లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి ఫిర్యాదు చేశారు.

### కాలనీ రోడ్డు కబ్జా..!

తూకుంట గ్రామంలోని సర్వే నంబర్లు 286, 332లలోని 8 ఎకరాల 4 గుంటల భూమిలో 2017లో ఓ ప్రైవేట్ వెంచర్ ప్రారంభమైంది. ఇందులో 133 ప్లాట్లు విక్రయించగా, కొందరు ప్రభుత్వ అనుమతులతో ఇండ్లను నిర్మించుకున్నారు. కాలనీవాసులు రెడ్డి అసోసియేషన్' పేరిట ఓ హౌసింగ్ సొసైటీని ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఇటీవల తూకుంట మున్సిపాలిటీ పరిధిలో భూముల ధరలు భారీగా పెరగడంతో, భూ యాజమానులు, వెంచర్ నిర్వాహకుల మధ్య వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో అప్పట్లో లే అవుట్ లో రోడ్డుగా చూపిన స్థలాన్ని గూడూరి సత్తిరెడ్డి అనే వ్యక్తి అక్రమంగా ఫెన్సింగ్ వేసి ఆక్రమించాడు. అంతేకాకుండా అదే రోడ్డుపై బోరు వేసి చెట్లు నాటి స్థలాన్ని తన స్వంతంగా మలచుకునే ప్రయత్నం చేస్తున్నాడు. దీనిపై రెడ్డి అసోసియేషన్ సభ్యులు కోర్టును ఆశ్రయించగా, కోర్టు అసోసియేషన్ కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయినా, సత్తిరెడ్డి కోర్టు ఆదేశాలను ఖాతరు చేయకుండా రోడ్డు నుంచి తొలగిపోకుండా కొనసాగుతున్నాడు. పోలీసులకు ఫిర్యాదు. స్పందనలేక రోడ్డుపై అక్రమాన్ని నిరోధించేందుకు కాలనీవాసులు శామీర్ పేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు వాపోతున్నారు.

### కలెక్టర్ దృష్టికి సమస్య

ఈ ఘటనపై న్యాయం చేయాలని కోరుతూ బాధితులు సోమవారం మేడ్చల్ కలెక్టరేట్లో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ మను చౌదరిని కలిసి వినతి పత్రం సమర్పించారు. కలెక్టర్ ను కలిసిన వారిలో రెడ్డి అసోసియేషన్ కమిటీ సభ్యులు గుడిపాటి రత్నాకర్ రెడ్డి, ఎన్. శుభ్ కుమార్, బోయిళ్ల పోలిరెడ్డి, ఎం. రామ్ యాదవ్, కె. వెంకటరమణ, పి. హనుమంతరావు, ఎం.డి. మినహజుద్దీన్, కిందిగిరి రమేష్, సింగిరెడ్డి శంకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

### "రోడ్డుకు న్యాయం చేయండి"

కాలనీవాసులు తమకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకొని రోడ్డు ప్రజలకు తిరిగి అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.

# ప్రజాస్వరం

PRAJASWARAM తెలుగు దినపత్రిక

హైదరాబాద్ బుధవారం 16, జులై 2025


## మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్

# అధికార పార్టీ దళిత యువ నాయకుడి హత్య

▶ తుపాకీ తో కాల్చి చంపిన దుండగులు.... ▶ హత్య కు భూమి, డబ్బుల వివాదాలే కారణమా..? ▶ ఘటనా స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ ▶ కొనసాగుతున్న విచారణ







**మెదక్ జూలై 15 (ప్రజా స్వరం)** మెదక్ జిల్లా లో కాల్పుల తో కలకలం రేపింది. కాంగ్రెస్ పార్టీ కి చెందిన దళిత యువ నాయకుడిని తుపాకీ తో కాల్చి హత్య చేసిన ఘటన సంచలనం సృష్టించింది. ముందుగా రోడ్డు ప్రమాదం గా భావించారు. కానీ ఈ హత్య ఘటనకు రాయలసీమ చెందిన నేత హస్తం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెదక్ జిల్లా కొల్చారం మండలం పైతరకు చెందిన మారెల్లి అనిల్ సోమవారం రాత్రి వరిగుంతం సబ్ స్టేషన్ వద్ద రోడ్డు పక్కన వెళ్ళిన కారులో గాయాలై ఉన్నాడు. స్థానికులు గమనించి రక్తపు మడుగులో గాయాలైన అనిల్ ను గుర్తించి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రోడ్డు ప్రమాదంగానే అంతా భావించారు. కానీ అనిల్ శరీరం లో బుల్లెట్ గాయాలు ఉండడం తో హత్యగా గుర్తించి ఘటన స్థలం లో పరిశీలించగా నాలుగు బుల్లెట్స్ లభ్యమైనట్లు తెలిసింది. గన్ తో హత్య చేసిన వైనం పై జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస్ రావు వెంటనే స్పందించి ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ కు ఆదేశించారు.

### హైదరాబాద్ మీటింగ్ వెళ్లి రాగానే

గాంధీ భవన్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ తో జరిగిన నర్సాపూర్ నియోజక వర్గ నేతల సమావేశానికి అనిల్ కారులో స్థానిక కాంగ్రెస్ నేతలు సైతం వెళ్ళారు. అక్కడ మీటింగ్ ముగిసిన తర్వాత తిరిగి వస్తున్న క్రమంలో హంతకులు వెంటే వచ్చినట్లు తెలుస్తుంది. కారులో ఉన్న అందరు దిగి వెళ్ళిన తర్వాత హత్య చేసినట్లు తెలుస్తుంది. వెళ్తున్న కారుకు రెండు వైపుల కార్లు పెట్టీ డోర్ వద్దకు వెళ్ళి దగ్గర నుంచి షూట్ చేసినట్లు బావిస్తున్నారు. గన్ తో షూట్ చేసిన బుల్లెట్స్ శరీరంలోనే ఉన్నట్లు సమాచారం.ఫోరెన్సిక్ అధికారులు వచ్చి బులెట్ తీసిన తరవాతే గన్ ఎక్కడిది, ఎంత రేంజ్ నుంచి కాల్చారు అనే వివరాలు తెలిసే అవకాశం ఉంది. అనీల్ హత్య కుట్రలో రాజలసీమ నేత తో పాటు ఇటీవల కాలంలో జరిగిన భూ వివాదాలు, ఇతర పంచాయతీల్లో పాల్గొన్న వాటి వివరాలు సైతం సేకరిస్తున్నట్లు తెలిసింది. సుఫారీ ఇచ్చి హత్య చేయించారా.. బాధితులే నేరుగా వచ్చి హత్య చేశారా అనే కోనంలో కూడా విచారణ చేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు ఆసుపత్రిలో ఉన్న అనిల్ మృతదేహాన్ని చూసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పోలీస్ అధికారులతో మాట్లాడి హంతకులను త్వరగా పట్టుకోవాలని కోరారు.

### జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు మాట్లాడుతూ..

మొదట రోడ్డు ప్రమాదం అని భావించామని, కానీ ఆసుపత్రి లో వైద్యులు బుల్లెట్ గాయాలు అయ్యాయని తేల్చడంతో సంఘటన స్థలంలో సమగ్ర విచారణ చేయడం జరుగుతుందని అన్నారు. సంఘటన స్థలంలో బుల్లెట్ లు స్వాధీనం చేసుకున్నామని, మరిన్ని వివరాలు ఫోరెన్సిక్ రిపోర్ట్ ఆధారంగా విచారణ ముమ్మరం చేస్తామని అన్నారు. ఇప్పటికే హత్య కేసు లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని త్వరలోనే నిందితులను పట్టుకుంటామని అన్నారు.



## వైద్య కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా

# డాక్టర్ నితిన్ కబ్రా



**మెదక్ జూలై 15 (ప్రజా స్వరం)** మెదక్ జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల నూతన ప్రిన్సిపాల్ గా నితిన్ కబ్రా నియామకం అయ్యారు.

ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ ను పూల మొక్క అందించి మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాల అభివృద్ధికి జిల్లా కలెక్టర్ సలహాలు సూచనలు పాటిస్తూ సమన్వయంగా పని చేస్తామని తెలిపారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఆలియాబాద్ మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి



శామీర్ పేట జూలై 15(ప్రజా స్వరం)అలియాబాద్ మునిసిపాలిటీ తుర్కపల్లి జినోన్ వ్యాలీలో మంగళవారం ఐకార్ బయాలజీ సంస్థ కంపెనీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఆలియాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు..

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**మనోహరబాద్ (ప్రజాస్వరం) :** మనోహరబాద్ మండలం పరికిబండ, తుపాకులపల్లి గ్రామాలకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు మంచి శ్రీరామ్ అందజేశారు. కుమ్మరి చరణ్ కు రూ.23,500, కే.ఎల్లం రూ.60,000లకు మంజూరైనా చెక్కులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరాం మాట్లాడుతూ నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సహకారంతో ఈ చెక్కులు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో బల్లబోయిన నర్సింలు, ఆంజనేయులు,డప్పు లక్ష్మణ్,మంచి రమేష్,కుమార్,కాషా రాములు,రమేష్, శ్రీరాములు, అశోక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ జిపిఎఫ్‌లు వెంటనే విడుదల చేయాలి: పిఆర్టియూటిఎస్

### – మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్

శామీర్ పేట జూలై15(ప్రజా స్వరం)ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ జిపిఎఫ్ లు వెంటనే విడుదల చేయాలనీ పిఆర్టియూటిఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్ అన్నారు.ఉపాధ్యాయులు నెల నెల జిపిఎఫ్ లో దాచుకున్న డబ్బులు పిల్లల పెళ్లిలకు మెడికల్ శస్త్ర చికిత్సల కోసం అత్యవసర పరిస్థితుల కోసం అప్లయ్ చేసుకున్న ఏడాదిన్నరగా బిల్లులు మంజూరు చేయకపోవటం దారుణం అని వెంటనే ఏడాదిన్నరగా పెండింగ్లో ఉన్న జిపిఎఫ్ బిల్లులు చెల్లించాలని పిఆర్టియూటిఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం శామీర్ పేట మండలం లాల్ గాడి మలక్ పేట్, తుర్కపల్లి, మజీద్ పూర్ పాఠశాలలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.పెండింగ్ బిల్లులకు సంబంధించి జూన్ మాసం నుండి ప్రతి నెల 700 కోట్లు రిలీజ్ చేస్తామని 180 కోట్లు మాత్రమే రిలీజ్ చేశారని గతనెల 500 కోట్లు ఈనెల 700 కోట్లు రిలీజ్ 20 వ తేదీ లోపు జిపిఎఫ్ బిల్లులు చెల్లించకపోతే పిఆర్టియూటిఎస్ రాష్ట్ర సంఘం ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి నాయకత్వంలో ఉద్యమిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మహేష్, ప్రధాన కార్యదర్శి గోపాల్, రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు చంద్ర శేఖర్, సత్యం, శ్రీలక్ష్మి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.




## వాహనాల సోదాల్లో దొరికిపోయిన

# ఆరుగురు దొంగలు




**మహబూబాబాద్** వాహనాల తనిఖీలో ఆరుగురు దొంగలు పోలీసులకు పట్టుబడ్డారు. బయ్యారం మెయిన్ రోడ్డు పై వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిని విచారించగా వివిధ ప్రాంతాలలో దొంగతనాలు చేసినట్టు నేరాన్ని అంగీకరించారు.

దొంగల నుండి ఒక టాటా ఏసీ వాహనం, ఒక ట్రాక్టరు, రోటవేటర్, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్ని రిమాండ్ కు తరలించారు.

## పలుగుట్ట ఆలయం స్వామి వారిని

# దర్శించుకున్న వినయ్ రెడ్డి



ఆర్మూర్,: నందిపేట్ మండల కేంద్రంలోని పాల్గుట్ట ఆలయాన్ని సందర్శించి, స్వామి వారి ఆశీస్సులు పొందిన ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిర్మించనున్న అయ్యప్ప మందిర నిర్మాణాన్ని పరిశీలించారు. దీనికి ప్రభుత్వ సహాయంతో నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నందిపేట్, దొంకేశ్వర్, ఆర్మూర్ మండల నాయకులు పాల్గొన్నారు.

## ఆర్మూర్‌లో ముగ్గురికి

# సెల్ ఫోన్ల అందజేత

బోధన్,: ఆర్మూర్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో పోయిన మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సేకరించి బాధితులకు మూడు మొబైల్ ఫోన్ లను అప్పగించినట్లు ఎస్ హెచ్ వో సత్యనారాయణ తెలిపారు. సెల్ ఫోన్ పోతే పీఎస్ లో ఫిర్యాదు చేసి, సీఈఐఆర్ పోర్టల్ లో నమోదు చేయాలన్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు.

## ఆవు కళేబరంపై విషం చల్లిన

# నలుగురిపై కేసు నమోదు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి సెగ్మెంట్ రామారెడ్డి మండలం రెడ్డిపేట స్కూల్ తండా అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచారం కలకలం రేపిన విషయం పాఠకులకు విధితమే. నాలుగు రోజుల క్రితం ఓ ఆవుపై పులి దాడి చేసి చంపింది. ఆవుపై పెద్దపులి దాడి చేయడంతో ఆగ్రహానికి గురైన ఓ రైతు ఆవుపై విషం చల్లాడు. అయితే చనిపోయిన ఆవు కళేబరం మీద విషం చల్లిన నలుగురిపై పోలీసులు అటవిశాఖ ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి, రిమాండ్ చేసారు.

%Edited, Printed, Published and Owned by PURAM MAHESHWAR Printed at HARI HARA ART PRINTERS,H.No.6-185,Toopran,Dist.Medak, Telangana-502336. and Published at H.No. 4-50/18,Kallakal, Vill-Kallakal,(PO). Kadlakal,(M) Manoharabad, Dist.Medak-Telangana -502336. Editor: PURAM MAHESHWAR. RNI. No:TELTEL/2006/17154. Cell:800860999